పెన్ పవర్
రాయలసీమ
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా। తిరుపతి। చిత్తూరు। వై.ఎస్.ఆర్. కడప

# ఆడి కృత్తిక సందర్భంగా శ్రీ సుబ్రహ్మణ్యం స్వామివారికి వైభవంగా గ్రామోత్సవం

**బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ ఆగస్టు 7:** జొన్నవాడ క్షేత్రములో ఆడి కృత్తిక పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్య స్వామివారికి గ్రామోత్సవం అత్యంత వైభవోపేతంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా స్వామివారిని పుష్పాలతో అద్భుతంగా అలంకరించి, ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు, అర్చనలు, హారతులు నిర్వహించారు. అనంతరం భక్తజనుల మధ్య స్వామివారి గ్రామోత్సవం ఘనంగా సాగింది. వేద మంత్రోచ్చారణల నడుమ, మంగళ వాయిద్యాల మధ్య స్వామివారు గ్రామ వీధులలో విహరించగా, భక్తులు పాల్గొని స్వామివారికి హారతులు సమర్పించి దర్శించుకొని దైవానుగ్రహం పొందారు. ఈ కార్యక్రమంనకు నెల్లూరు వాస్తవ్యులు దేగపూడి మల్లికార్జున దంపతులు రాజోలు వాస్తవ్యులు సిహెచ్ వెంకటరెడ్డి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. తిరుమూరు అశోక్ రెడ్డి చైర్మన్ ధర్మకర్త మండల సభ్యులు అర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి సహాయ కమీషనరు కార్యనిర్వహణాధికారి



# హరిత విప్లవ పితామహుడు ఎం.ఎస్. స్వామినాథన్ జయంతి వేడుకలు

**మొక్కలు నాటి నివాళులర్పించిన ఏపీజె అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు**

**గూడూరు, పెన్ పవర్, ఆగస్టు 7 :** డాక్టర్ ఏ.పీ.జే. అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్ నెల్లూరు జిల్లా గౌరవ అధ్యక్షురాలు గూడూరు ఉషారాణి ఆధ్వర్యంలో మనుబోలు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త, హరిత విప్లవ పితామహుడు డాక్టర్ ఎం.ఎస్. స్వామినాథన్ జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమానికి ట్రస్ట్ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ సయ్యద్ తాజుద్దీన్ ముఖ్య అతిథిగా హాజరై ఎం.ఎస్. స్వామినాథన్ చిత్రపటానికి నివాళు లర్పించారు. అనంతరం ఆయన జ్ఞాపకార్థం పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఉషారాణి మాట్లాడుతూ భారతదేశంలో ఆహార ధాన్యాల ఉత్పత్తిని పెంచి, దేశాన్ని ఆహార భద్రత దిశగా నడిపించడంలో ఎం.ఎస్. స్వామినాథన్ కీలక పాత్ర పోషించారని తెలిపారు. అధిక దిగుబడినిచ్చే వరి రకాల అభివృద్ధికి ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం. నరేంద్రనాథ్ చౌదరి, వి. కృష్ణజ్యోతి, పి.వి. రమేష్, కవిత, దాసరి ఉషాకుమారి, జయమ్మ, పి. ప్రియాంక, రంజిత్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల సంక్షేమానికి కేంద్రం ప్రాధాన్యం

**వేతనాలపై ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ప్రశ్నలకు కేంద్రం సమాధానం ఆంధ్రప్రదేశ్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలకు రూ.7,000, ఆయాలకు రూ.4,750 అదనపు గౌరవ వేతనం పదోన్నతులు, బీమా, ఆరోగ్య రక్షణ, పెన్షన్ పథకాలతో సంక్షేమానికి ప్రాధాన్యం**

**నెల్లూరు పెన్ పవర్ ఆగస్టు 7:** అంగన్‌వాడీ సేవల పథకం కింద అంగన్‌వాడీ కార్యకర్తలు ( ఏ డబ్ల్యు హెచ్ లు), అంగన్‌వాడీ ఆయాలు ( ఏ డబ్ల్యు హెచ్ లు) పొందుతున్న వేతనం, రాష్ట్ర ప్రభుత్వాలు అదనంగా చెల్లిస్తున్న గౌరవ వేతనాల వివరాలు, కేంద్ర--రాష్ట్ర వ్యయ భాగస్వామ్య విధానం, పదవీ విరమణ అనంతర సంక్షేమ చర్యలు, బీమా, పెన్షన్, వేతనాల సకాలంలో చెల్లింపు వంటి అంశాలపై నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి లోక్‌సభలో లిఖితపూర్వకంగా ప్రశ్నలు అడిగారు. ఎంపీ వేమిరెడ్డి ప్రశ్నలకు కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ సహాయ మంత్రి సావిత్రి ఠాకూర్ శుక్రవారం లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు.

**2018లో కేంద్ర వేతనాల పెంపు :** అంగన్‌వాడీ కార్యకర్తలు, అంగన్‌వాడీ ఆయాలు స్వచ్ఛందంగా సేవలందించే ఉద్యోగులని కేంద్ర మంత్రి తెలిపారు. వీరికి చెల్లించే వేతనాన్ని అవసరానికి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు పెంచుతూ వస్తోందన్నారు. 2018 అక్టోబర్ 1 నుంచి అంగన్‌వాడీ కార్యకర్తల కేంద్ర వేతనాన్ని నెలకు రూ.3,000 నుంచి రూ.4,500కు, అంగన్‌వాడీ ఆయాల వేతనాన్ని రూ.1,500 నుంచి రూ.2,250కు పెంచినట్లు వెల్లడించారు. అంతేకాకుండా అంగన్‌వాడీ కార్యకర్తలకు నెలకు రూ.500, అంగన్‌వాడీ ఆయాలకు రూ.250 చొప్పున పనితీరు ఆధారిత ప్రోత్సాహకాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్నట్లు తెలిపారు.

**ఆంధ్రప్రదేశ్‌లో అదనపు గౌరవ వేతనం :** కేంద్ర ప్రభుత్వం వెల్లడించిన వివరాల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలు తమ సొంత నిధులతో కేంద్ర వేతనానికి అదనంగా టాప్-అప్ గౌరవ వేతనాన్ని చెల్లిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో



అంగన్‌వాడీ కార్యకర్తలకు నెలకు రూ.7,000, అంగన్‌వాడీ ఆయాలకు రూ.4,750 చొప్పున అదనపు గౌరవ వేతనం చెల్లిస్తున్నట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు.

**పదోన్నతులు, సంక్షేమ చర్యలు :** మిషన్ సక్షమ్ అంగన్‌వాడీ అండ్ పోషణ్ 2.0 కింద అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు చేపట్టినట్లు కేంద్ర మంత్రి తెలిపారు. అంగన్‌వాడీ ఆయాలకు పదోన్నతి అవకాశాలు కల్పిస్తూ అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టుల్లో 50 శాతం, అంగన్‌వాడీ కార్యకర్తలకు సూపర్‌వైజర్ పోస్టుల్లో 50 శాతం పదోన్నతి ద్వారా భర్తీ చేసే విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే సంవత్సరానికి 20 రోజుల వార్షిక సెలవులు, 180 రోజుల చెల్లింపు ప్రసూతి సెలవు, గర్భస్రావం జరిగిన సందర్భంలో 45 రోజుల చెల్లింపు సెలవులు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

**పెన్షన్, బీమా, ఆరోగ్య రక్షణ :** అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ప్రధాన్ మంత్రి శ్రమ్ యోగి మాంధన్ (పి ఎం - ఎస్ వై ఎం ) పెన్షన్ పథకంలో చేరేలా రాష్ట్రాలను ప్రోత్సహిస్తున్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు. అదేవిధంగా ప్రధాన్ మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (పీఎంజేజేబివై) కింద రూ.2 లక్షల జీవిత బీమా, ప్రధాన్ మంత్రి సురక్షా బీమా యోజన ( పిఎంఎస్ బి వై ) కింద ప్రమాద బీమా సదుపాయాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. 2024--25 ఆర్థిక సంవత్సరం నుంచి ఆయుష్మాన్ భారత్ ప్రధాన్ మంత్రి జన ఆరోగ్య యోజన (ఏబి - పి ఎం జె ఏ వై ) కింద అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలందరికీ సంవత్సరానికి రూ.5 లక్షల వరకు ఆరోగ్య బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఏడాది ఏప్రిల్ 30ను పదవీ విరమణ తేదీగా అమలు చేయాలని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు సూచించినట్లు వెల్లడించారు.

**సకాలంలో గౌరవ వేతనాల చెల్లింపునకు చర్యలు :** మిషన్ సక్షమ్ అంగన్‌వాడీ అండ్ పోషణ్ 2.0 పథకాన్ని కేంద్ర ప్రాయోజిత పథకంగా అమలు చేస్తున్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు. విధాన రూపకల్పన, ప్రణాళిక బాధ్యతలు కేంద్ర ప్రభుత్వానివని, రోజువారీ అమలు బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదేనని పేర్కొన్నారు. వేతనాలు, ప్రోత్సాహకాలు సకాలంలో చెల్లింపునకు పారదర్శకత, జవాబుదారీతనం పెంచే ఉద్దేశంతో ఎస్ ఎన్ ఏ -స్పర్శ వ్యవస్థ ద్వారా 'జస్ట్ ఇన్ టైమ్' విధానంలో నిధులు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. అలాగే అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలతో నిరంతరం వీడియో కాన్ఫరెన్సులు నిర్వహిస్తూ నిధుల వినియోగాన్ని సమీక్షిస్తున్నట్లు వెల్లడించారు.

# రెండు రోజు రిలే నిరాహార దీక్ష



**కోవూరు పెన్ పవర్ ఆగస్టు 7:** డీఎస్సీ లో జరిగిన అక్రమాలపై, అవకతవకలపై సీబీఐ విచారణ జరపాలని, బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కోవూరులో రెండో రోజు చేస్తున్న రిలే నిరాహా దీక్షకు నెల్లూరు కోర్టు న్యాయవాదులు కోరికల చంద్రశేఖర్ పూరి నాగేంద్ర యద్దనపూడి బ్రహ్మ తేజ పులిపాక దినేష్ కుమార్ దొద్దల తిరుపతిరావు బొప్పరాజు ఆదర్శ్ మాజీ మంత్రివర్యులు, వైసీపీ రాష్ట్ర పాక్ సభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి కలసి దీక్షా శిబిరంలో రిలే నిరాహార దీక్ష చేస్తున్న వారికి సంఘీభావం తెలిపారు..

# రిలే నిరాహార దీక్షల్లో భాగంగా రెండో రోజు మెగా డియస్సి అక్రమలపై వైయస్సార్ సిపి మహిళలు గర్జన.

**మంత్రి నారా లోకేష్..రాజీనామా చేయాలంటూ.. డియస్సి అవినీతి అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలంటూ హోరేత్తిన నిరసన.**

**నెల్లూరు పెన్ పవర్ ఆగస్టు 7:** నెల్లూరు వి ఆర్సీ సెంటర్ లో వైస్సార్సీపీ నెల్లూరు సిటీ నియోజకవర్గ ఇన్ చార్జ్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో రెండో రోజు డియస్సి అక్రమాలపై రిలే నిరాహార దీక్షలు.. ఉధృతంగా సాగాయి. ఈ కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ వైఎస్ఆర్సిపి రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత కూడా విచ్చేసి సంఘీభావం తెలిపారు. మెగా డియస్సిని దగా డియస్సిగా మార్చి..టీచర్ ఉద్యోగాలను అమ్ముకున్న విద్యాశాఖ మంత్రి లోకేష్ రాజీనామ చేయాలంటూ మహిళలు నినాదాలు చేశారు. లక్షలాదిమంది నిరుద్యోగులను... రోడ్డు మీద పెట్టిన మెగా డియస్సి అవినీతి అక్రమాలపై.. తక్షణమే సిబిఐ దర్యాప్తు.. జరిపించాలంటూ డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. మెగా డీఎస్సీ అక్రమాలతో రాష్ట్రంలో 3 లక్షల 50వేల మంది నిరుద్యోగులు దగాపడ్డారని అన్నారు. ఎలాంటి అర్హతలేని తమ తమ కార్యకర్తలకు .. కూటమి ప్రభుత్వం టీచర్ ఉద్యోగాలను అడ్డదారిలో కట్టబెట్టిందని ధ్వజమెత్తారు. ఈరోజు కూటమి ప్రభుత్వం అనుసరించిన తప్పుడు విధానాలతో అన్ని అర్హతలు ఉండి ఉద్యోగం రాని ..ఎంతో మంది అభ్యర్థులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. టీచర్ ఉద్యోగాలను అమ్ముకొని... ప్రభుత్వం నిరుద్యోగుల గొంతు కోసిందన్నారు.ప్రభుత్వం తప్పు చేయకపోతే.. డియస్సి అక్రమాలపై సిబిఐ విచారణ జరిపించేందుకు ఎందుకు నిరాకరిస్తుందో చెప్పాలన్నారు. ఈరోజు డీఎస్సీ అక్రమాలపై రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమం జరుగుతుంటే..



ప్రజలకు సమాధానం చెప్పాల్సింది పోయి.. ఎలాంటి అవినీతి జరగలేదని ప్రభుత్వం కోర్టులను నమ్మించే ప్రయత్నం చేస్తుందన్నారు. ఈరోజు మెగా డీఎస్సీలో ప్రభుత్వం చేసిన తప్పులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా .. పూర్తి ఆధారాలతో ప్రజల ముందుంచినప్పుడు..సిబిఐ జరిపించకపోవడం శోచనీయమన్నారు. టీచర్ ఉద్యోగాన్ని 15 లక్షలకు అమ్ముకున్న ఆడియో కాల్స్ బయటికి వచ్చినప్పుడు దానిపై కనీస విచారణ కూడా చేయలేదన్నారు. ఈ అక్రమాలపై మంత్రి నారా లోకేష్ బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలన్నారు. సిబిఐ దర్యాప్తు జరిపితే ఎక్కడ మంత్రి నారా లోకేష్ అవినీతి గుట్టు బయటపడుతుందోనన్న భయంతో.. మంత్రి లోకేష్ మోడీ కాళ్ల దగ్గర మోకరిల్లి సిబిఐ విచారణ అడ్డుకోవడం సిగ్గుచేటన్నారు. నిరుద్యోగ భృతి ఎక్కడ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 30 లక్షల మంది యువతకు నిరుద్యోగ భృతి.. ఇస్తామని చెప్పి.. ఈరోజుటి వరకు ఒక్కరికి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు.ఇచ్చిన హామీ అమలు చేయకుండా ఈరోజు 30 లక్షల మంది యువత గొంతు కోశారని ఆవేదన వ్యక్తం చేశారు.

**పెండింగ్ లో ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు ఊసే లేదు :** ఏడాదికి 9 లక్షల 70 వేల మంది విద్యార్థులకు.. ఫీజు రీయింబర్స్మెంట్ అందిస్తామని చెప్పి.. ఇప్పటివరకు ఒక్కరికి కూడా ఫ్లీజ్ రియంబర్స్మెంట్ చెల్లించకుండా విద్యార్థులును వేదనకు గురి చేస్తున్నారని అన్నారు. 2024 ఎన్నికలకు ముందు 10 వేల కోట్ల రూపాయలు ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు విద్యార్థులకు చెల్లించేందుకు జగన్మోహన్ రెడ్డి సంకల్పిస్తే కోర్టులకు వెళ్లి దాన్ని అడ్డుకున్నది కూటమి నేతల కాదా చెప్పాలన్నారు. ఈ రోజుటికి ఆ బకాయిలను కూటమి ప్రభుత్వం విద్యార్థులకు చెల్లించలేదన్నారు. ఈరోజు ఎంతోమంది విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ అందక.. విద్యార్థులు చదువులు రోడ్డున పడ్డాయన్నారు. మంత్రి నారా లోకేష్ అనాలోచిత నిర్ణయాలు అవినీతి అక్రమాలతో.. విద్యావ్యవస్థని భ్రష్టు పట్టిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా నారా లోకేష్ డీఎస్సీ అక్రమాల విషయంలో రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే రాబోయే రోజుల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఈ పోరాటాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడం జరుగుతుందన్నారు

# 12వ జాతీయ చేనేత దినోత్సవం



**బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ ఆగస్టు 7:** చేనేత కార్మికులను గుర్తించి చేనేత కార్మికులకు ఆగస్టు 7వ తేదీన జాతీయ చేనేత దినోత్సవం ఏర్పాటు చేసినటువంటి భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అభినందనలు తెలిపినారు 12వ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత ఐక్యవేదిక నెల్లూరు జిల్లా అధ్యక్షులు బుదరపు బాలాజీ ఆధ్వర్యంలో నెల్లూరులోని గాంధీ బొమ్మ సెంటర్ వద్ద జాతీయ చేనేత దినోత్సవం జరుపుకోవడం జరిగినది ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్ మొగలి వెంకటేశ్వర్లు పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షులు కాసా శ్రీనివాసులు పాల్గొని చేనేత కార్మికులను ఉద్దేశించి మాట్లాడినారు. బుచ్చిరెడ్డిపాలెం భారతీయ జనతా పార్టీ అర్బన్ ఉపాధ్యక్షులు కోణం శ్రీనివాసులు భారతీయ జనతా పార్టీ బుచ్చిరెడ్డిపాలెం అర్బన్ చేనేత సెల్ నాయకులు గుత్తికొండ పెంచల స్వామి పాల్గొన్నారు.

# బెల్ట్ షాపులపై సీపీఐ ఫిర్యాదు

**గార్లదిన్నెలో అక్రమ మద్యం విక్రయాలపై చర్యలు తీసుకుంటామని హామీ**

**ప్యాపిలి,(పెన్ పవర్) :** స్థానిక మండలంలోని గార్లదిన్నె గ్రామంలో కొనసాగుతున్న బెల్ట్ షాపులను వెంటనే మూసివేసి, అక్రమ మద్యం విక్రయాలను అరికట్టాలని కోరుతూ సీపీఐ మండల కార్యదర్శి జె. మహేష్ ఆధ్వర్యంలో నాయకులు జలదుర్గం ఎస్సై అనిల్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో బెల్ట్ షాపుల కారణంగా శాంతిభద్రతలకు విఘాతం కలుగుతోందని సీపీఐ నాయకులు ఎస్సై దృష్టికి తీసుకెళ్లారు. మద్యం మత్తులో కొందరు వ్యక్తులు మహిళలు, వృద్ధులు, విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. అక్రమ మద్యం విక్రయాల వల్ల కుటుంబాల్లో ఆర్థిక ఇబ్బందులతో పాటు గొడవలు పెరుగుతున్నాయని వివరించారు. సీపీఐ నాయకులు సమర్పించిన వినతిపత్రంపై ఎస్సై అనిల్‌కుమార్ సానుకూలంగా స్పందించారు. సమస్యను పరిశీలించి అక్రమ మద్యం విక్రయాలు, బెల్ట్ షాపులపై చర్యలు తీసుకుంటామని



హామీ ఇచ్చారు. గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను ఉపేక్షించబోమని స్పష్టం చేసినట్లు సీపీఐ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి జె. మహేష్ మాట్లాడుతూ, గార్లదిన్నె గ్రామంలో బెల్ట్ షాపుల సమస్యపై పోలీసులు సానుకూలంగా స్పందించడం అభినందనీయమన్నారు. అధికారులు ఇచ్చిన హామీ మేరకు త్వరితగతిన చర్యలు తీసుకుని అక్రమ మద్యం విక్రయాలను పూర్తిగా అరికట్టాలని కోరారు. ప్రజల శాంతి, భద్రతకు విఘాతం కలిగించే బెల్ట్ షాపులు, అక్రమ మద్యం విక్రయాలపై సీపీఐ ప్రజల తరఫున నిరంతరం పోరాడుతుందని మహేష్ తెలిపారు. అధికారులు ఇచ్చిన హామీ అమలును పార్టీ పర్యవేక్షిస్తుందని, సమస్య పరిష్కారం కాకపోతే ప్రజలను సమీకరించి చట్టబద్ధమైన ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు రామచంద్రుడు, మనోహర్, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ మోసంలో రూ.లక్ష మాయం

**రూ.10 వేల చొప్పున పది సార్లు యూనియన్ బ్యాంక్ ఖాతా నుంచి కట్**

**ఫిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసిన బాధితుడు**




**ప్యాపిలి,(పెన్ పవర్) :** సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకుని పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన జింకల అంజి తన ఖాతాలోని నగదును కోల్పోయానని బాధితుడు వాపోయాడు. తన యూనియన్ బ్యాంక్ ఖాతా నుంచి రూ.10 వేల చొప్పున ఏకంగా పది సార్లు నగదు కట్ అయిందని ఆవేదన వ్యక్తం చేశాడు. మొత్తం రూ.లక్ష వరకు నగదు పోవడంతో తీవ్ర ఆందోళనకు గురయ్యానని తెలిపాడు. తనకు ఎలాంటి సమాచారం లేకుండా ఖాతా నుంచి వరుసగా నగదు కట్ కావడంతో బ్యాంకును సంప్రదించినట్లు బాధితుడు పేర్కొన్నాడు. ఈ ఘటనపై ఫిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. తనకు జరిగిన నష్టాన్ని తిరిగి ఇప్పించి, తన ఖాతా నుంచి నగదు కట్ చేసిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను వేడుకున్నాడు. "కష్టపడి సంపాదించిన డబ్బు ఇలా ఖాతా నుంచి పోవడంతో ఏం చేయాలో అర్థం కావడం లేదు. సైబర్ నేరగాళ్లను గుర్తించి నాకు న్యాయం చేయాలి" అంటూ బాధితుడు వాపోయాడు.

# కలం కన్నీరు పెడుతోంది పుస్తకావిష్కరణ



**నెల్లూరు పెన్ పవర్ ఆగస్టు 7:** పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నెల్లూరు టౌనుహాలు నందు రచయిత మురళీమోహన్ రాజు రచించిన ' కలం కన్నీరు పెడుతోంది ' కవితా సంపుటిని నెల్లూరు నగర మేయర్ దేవరకొండ సుజాత, శుభమస్తు షాపింగ్ మాల్ అధినేత బయ్యా శ్రీనివాసులు ఆవిష్కరించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. మేయర్ సుజాత మాట్లాడుతూ సామాజిక స్పృహ కలిగించే కవితలు రాసిన మురళీమోహన్ రాజును అభినందించారు. కళాకారులు ఉదయం నుండి రాత్రి వరకు నృత్య ప్రదర్శనలతో అలరించారు. ఈకార్యక్రమంలో వీరిశెట్టి హజరత్ బాబు, డాక్టర్ కె.పెంచల రెడ్డి, యనమల నాగేశ్వరరావు, కొండూరు హరినారాయణ రెడ్డి, సత్యంజీ, కొండూరు వేమారెడ్డి, షేక్ కాలేషా, యస్.వి. రమేష్ బాబు, బొమ్మి నాగ కిషోర్, షేక్ పర్వీన్, సయ్యద్ షబానా పర్వీన్, షేక్ రియాజ్ భాష, వాసు స్వామి, అందే శ్రీనివాసులు, తమ్మినేని పాండు తదితరులు ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో మురళీమోహన్ రాజు, టి.వెంకటేశ్వర్లు, రవి గోగులపల్లి, కేతా సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రియురాలిని హత్య చేసి దహనం చేసిన ప్రియుడు





**చిలకలూరిపేట , పెన్ పవర్, ఆగస్టు 07 :** పల్నాడు జిల్లా కారంపూడి మండలంలో జరిగిన దారుణ ఘటన నాలుగు రోజుల అనంతరం వెలుగులోకి వచ్చింది. చిలకలూరిపేటకు చెందిన షేక్ హసీనా (25)ను ఆమె ప్రియుడు, కారంపూడి మండలం ఇనుప రాజుపల్లికి చెందిన జిలుగు బాల సైదులు హత్య చేసి, ఆనవాళ్లు లేకుండా చేయాలనే ఉద్దేశంతో మృతదేహంపై పెట్రోల్ పోసి దహనం చేసినట్లు పోలీసులు వెల్లడించారు. పోలీసుల సమాచారం ప్రకారం, హసీనా మరియు బాల సైదులు గత ఐదేళ్లుగా ప్రేమలో ఉన్నారు. ఇటీవల వీరి మధ్య విభేదాలు తలెత్తడంతో, అనుమానాల నేపథ్యంలో బాల సైదులు ప్రేమ పేరుతో హసీనాను పిలిపించి హత్య చేసినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఘటన అనంతరం నిందితుడు తన తండ్రికి ఫోన్ చేసి యువతిని హత్య చేసినట్లు చెప్పడంతో విషయం బయటపడింది. సమాచారం అందుకున్న చిలకలూరిపేట పోలీసులు సాంకేతిక ఆధారాలు, ఫోన్ సిగ్నల్స్ సహాయంతో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు ఇచ్చిన వివరాల మేరకు ఎన్ఎస్పీ కాలువ సమీపంలో సుమారు 90 శాతం కాలిపోయిన స్థితిలో ఉన్న హసీనా మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు హత్యకు దారితీసిన పరిస్థితులు, ఇతర కోణాలపై సమగ్ర దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# నేతన్నల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపేట : ఎమ్మెల్యే కొండయ్య



**చీరాల, పెన్ పవర్, ఆగస్టు 7 :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాల కొండయ్య ఆధ్వర్యంలో చీరాల నియోజకవర్గంలో 12వ జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతన్నల సంక్షేమం కోసం ప్రతి చేనేత కుటుంబం ఖాతాలో ఆర్థిక సాయం జమచేసి సరికొత్త పథకానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో చీరాల ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో చేనేత వృత్తిని నమ్ముకొని జీవిస్తున్న ప్రతి కుటుంబానికి అండగా నిలవడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. నేతన్న నేస్తం /సేవలో పథకం కింద ప్రతి నేతన్న ఖాతాలో ప్రతి సంవత్సరం 25 వేల రూపాయలు నేరుగా జమ అయ్యేలా సీఎం చంద్రబాబు నాయుడు చర్యలు తీసుకున్నారని తెలిపారు. గడిచిన ఐదేళ్లలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన చేనేత రంగానికి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పూర్వ వైభవం తీసుకువస్తుందని ఆయన స్పష్టం చేశారు. చేనేత కార్మికులకు ఇస్తున్న విద్యుత్ రాయితీలు, 50 ఏళ్లకే చేనేత పింఛన్లు వంటి సంక్షేమ పథకాలు నేతన్నల జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతున్నాయని కొండయ్య కొనియాడారు. చీరాల నియోజకవర్గ అభివృద్ధితోపాటు, స్థానిక చేనేత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం తరపున ఎల్లప్పుడూ కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, చేనేత సంఘాల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# యువతను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం : మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య



**నాయుడుపేట, పెన్ పవర్, ఆగష్టు 7 :** కూటమి ప్రభుత్వం దొంగ జీవోలు తీసుకువచ్చి యువతను మోసం చేస్తుందని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలవేటి సంజీవయ్య ఆరోపించారు.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు డీఎస్సీలో జరిగిన అక్రమాలపై, అవకతవకలపై సిబిఐ విచారణ జరపాలని, బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నాయుడుపేట అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం 2వ రోజు రిలే నిరాహార దీక్ష కార్యక్రమం చేపట్టారు.రిలే నిరాహార దీక్ష కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ అబ్జర్వర్ బిరుదవోలు శ్రీకాంత్ రెడ్డి,పార్టీ రాష్ట్ర కార్యదర్శులు కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి,తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, జిల్లా కార్యనిర్వహక కార్యదర్శి కామిరెడ్డి రాజారెడ్డి,వైసీపీ నాయుడుపేట పట్టణ అధ్యక్షులు కలికి మాధవ రెడ్డి, వైసిపి నాయుడుపేట మండలం అధ్యక్షులు ఒట్టూరు కిషోర్ యాదవ్,వైసీపీ సూళ్లూరుపేట మండల అధ్యక్షులు అల్లూరు అనిల్ రెడ్డి,నాయుడుపేట ఏఎంసీ మాజీ చైర్మన్ తంబిరెడ్డి జనార్ధన్ రెడ్డి,వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు మద్దాలి సోమశేఖర్ రెడ్డి,వైసీ పి ఓజిలి మండల అధ్యక్షులు పాదర్తి హరినాథ్ రెడ్డి,నాయుడుపేట మున్సిపల్ మాజీ చైర్పర్సన్ కటకం దీపిక,పెళ్ళకూరు జడ్పిటిసి సభ్యులు నన్నం ప్రిస్కిల్లా,నాయుడుపేట ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి,ఓజిలి ఎంపీపీ గడ్డం అరుణా రెడ్డి, పెళ్ళకూరు ఎంపీపీ శేఖర్ రెడ్డి నాయుడుపేట మండల వైస్ ఎంపీపీ నెలవల మమత వైసీపీ నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షులు చదలవాడ కుమార్ వైసీపీ నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు అధ్యక్షురాలు ఈదా రత్నశ్రీ, వైసీపీ నియోజకవర్గ మైనారిటీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు షేక్ షబ్బీర్, వైసిపి నియోజకవర్గ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షులు పాలేటి నాగార్జున,నాయకులు బైన మల్లికార్జునరెడ్డి,కాలగంధ సునీల్,పేర్నాటి రాహుల్,షేక్ రహంతుల్లా పలువురు నాయకులు పాల్గొన్నారు.

# దళితవాడల్లో స్మశానాలకు దారి ఏర్పాటు చేయాలి

## సామాజిక సంఘాల నాయకుల డిమాండ్



**గూడూరు, పెన్ పవర్, ఆగస్టు 7 :** దళితవాడల్లో స్మశానాలకు వెళ్లేందుకు రహదారులు ఏర్పాటు చేయాలని, ఆక్రమణలను తొలగించి ప్రహరీ గోడలు నిర్మించాలని కె.వి.పి.ఎస్., వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘం, సి.ఐ.టి.యు నాయకులు డిమాండ్ చేశారు. సామాజిక శంఖారావం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గూడూరు ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ప్రజా సమస్యలపై అధికారులకు వినతిపత్రం అందజేశారు. గూడూరు రూరల్ పరిధిలోని పలు గ్రామాల్లో స్మశానాలకు దారులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, కొన్ని ప్రాంతాల్లో స్మశానాలు లేకపోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. దళితవాడల్లో పక్కా ఇళ్లు, ఇళ్ల స్థలాలు, డ్రైనేజీ, వీధిలైట్లు, రోడ్లు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే జక్కా వెంకయ్య శ్రామిక నగర్‌లో మురుగు కాలువ సమస్యను పరిష్కరించాలని, ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. గూడూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని అభివృద్ధి చేయాలని, నిలిచిపోయిన ఫ్లైఓవర్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని, తిరుమలకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భవన నిర్మాణాన్ని కూడా త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎమ్మార్వో ఆర్.వి. ప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించగా, స్మశానాల ఆక్రమణలను పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అడపాల ప్రసాద్, ఎంబేటి చంద్రయ్య, బి. నారాయణ, గోవింద్, జోగి శివకుమార్, పామంజి మణి, బి.వి. రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# బోధనలో ఎంజేపీలదే అగ్రస్థానం

**రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత**
**బీసీల విద్యకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం**
**ఈ ఏడాది కొత్తగా పది ఎంజేపీ గురుకులాల ఏర్పాటు**
**6 బాలికల గురుకులాలను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్**
**గురుకుల విద్యార్థులకు క్రీడల్లోనూ ప్రోత్సాహం : మంత్రి సవిత**
**వేటపాలెం ఎంజేపీలో మంత్రి సవిత ఆకస్మిక తనిఖీలు**



**బాపట్ల (పెన్ పవర్) ఆగస్టు 7** బాపట్ల జిల్లా వేటపాలెం మండలం కొత్తపాలెం గ్రామం రాష్ట్రంలో ఉన్న విద్యా సంస్థల్లో మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలలో అగ్రస్థానంలో ఉన్నాయని, ఎంజేపీల్లో నాణ్యమైన విద్యను బోధిస్తున్నామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ చేనేత మరియు జౌళి శాఖామాత్యులు ఎస్ సవిత తెలిపారు. కార్పొరేట్ విద్యా సంస్థల కంటే ఎంజేపీ గురుకుల విద్యాలయాల సీట్లకు అధిక డిమాండ్ ఉందన్నారు. బీసీల విద్యకు ప్రాధాన్యమిస్తూ...ఈ ఏడాది కొత్తగా పది ఎంజేపీ గురుకులాలను ఏర్పాటు చేశామన్నారు. ఆరు బాలికల గురుకులాలను జూనియర్ కళాశాలలు అప్ గ్రేడ్ చేశామన్నారు. వేటపాలెం మండలం కేంద్రంలో ఉన్న ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలను మంత్రి సవిత శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యతోనే బీసీలు అత్యున్నత స్థానాలు అధిరోహించగలరన్నారు. అందుకే బీసీల విద్యకు సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో కూటమి ప్రభుత్వం కొత్తగా పది ఎంజేపీ గురుకులాలను ఏర్పాటు చేసిందన్నారు. వాటితో పాటు ఆరు బాలికల గురుకులాలను జూనియర్ కళాశాలలు అప్ గ్రేడ్ చేశామన్నారు. ఏపీలో ఉన్న అన్ని విద్యా సంస్థల కంటే బోధనలో ఎంజేపీ గురుకులాలు అగ్రస్థానంలో ఉన్నాయన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థల సీట్ల కంటే ఎంజేపీ సీట్లకే డిమాండ్ ఎక్కువగా ఉందన్నారు. ఎంజేపీ గురుకులాల్లో నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం, వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసి పరిశుద్ధమైన

# అమరావతి చిత్రకళా వీధి ముఖ్యఅతిథిగా హాజరుకానున్న మంత్రి కందుల దుర్గేష్



**గుంటూరు: పెన్ పవర్, ఆగస్ట్, 07:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత మరియు సంస్కృతి కమిషన్ ఆధ్వర్యంలో గుంటూరు నగరంలో ఆగస్టు 8, 9 తేదీలలో (శని, ఆదివారాలు) గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్డు సమీపంలోని కొరిటేపాడు – విద్యానగర్ రోడ్డులో అత్యంత వైభవంగా నిర్వహించనున్న 'అమరావతి చిత్రకళా వీధి' ఉత్సవానికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. ఉదయం 10:00 గంటల నుండి రాత్రి 8:00 గంటల వరకు జరిగే ఈ కళా ప్రదర్శనకు మంత్రి దుర్గేష్ శనివారం ఉదయం 10 గంటలకు హాజరై కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించనున్నారు. అనంతరం జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి హోదాలో మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్. శంకరన్ హాల్‌లో జరిగే 'ఇరిగేషన్ అడ్వైజరీ బోర్డు' సమావేశంలో ఆయన పాల్గొంటారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ.. మన రాష్ట్ర సాంస్కృతిక వైభవాన్ని, కళాకారుల అత్యున్నత సృజనాత్మకతను ప్రపంచానికి చాటిచెప్పే లక్ష్యంతో ఈ ఉత్సవాన్ని రూపకల్పన చేశామన్నారు. దేశంలోని దాదాపు 10 రాష్ట్రాల నుండి 700 మందికి పైగా ప్రముఖ చిత్రకారులు ఈ ప్రదర్శనలో పాల్గొంటున్నారని, పెయింటింగ్‌లు, సంగీతం మరియు వైవిధ్యభరితమైన సాంస్కృతిక ప్రదర్శనలు ఈ వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయన్నారు. రాష్ట్ర సాంస్కృతిక వైభవానికి అద్దంపట్టే ఈ బృహత్తర వేడుకకు కళాభిమానులు, విద్యార్థులు మరియు ప్రజలు పెద్ద ఎత్తున హాజరై 'అమరావతి చిత్రకళా వీధి'ని దిగ్విజయం చేయాలని మంత్రి కందుల దుర్గేష్ శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

# గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



**చిలకలూరిపేట , పెన్ పవర్, ఆగస్టు 07 :** చిలకలూరిపేట: పట్టణంలోని అడ్డరోడ్డు సెంటర్ వద్ద గురువారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం కావడంతో స్థానికంగా కలకలం రేగింది. రోడ్డుపక్కన వ్యక్తి అపస్మారక స్థితిలో కనిపించడంతో స్థానికులు వెళ్లి పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. వెంటనే 108 అంబులెన్స్ సిబ్బందికి సమాచారం అందించగా, వారు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు ఎవరు, ఏ ప్రాంతానికి చెందినవారు, మృతికి గల కారణాలు ఏమిటన్న విషయాలు ఇంకా తెలియరాలేదు. ఈ ఘటనపై పోలీసులు సమాచారం సేకరిస్తుండగా, మృతుడి వివరాలు మరియు మృతికి గల కారణాలపై విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడికానున్నాయి.

# ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజా దర్బార్ : ఎమ్మెల్యే డా.నెలవల విజయశ్రీ




**సూళ్లూరుపేట, పెన్ పవర్, ఆగష్టు 7 :** సూళ్లూరుపేట నియోజకవర్గంలో క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా దర్బార్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ తెలియజేశారు. ప్రజలు ఏ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.శుక్రవారం సూళ్లూరుపేట ఎంపీడీవో కార్యాలయ ఆవరణలోని సివిఏపి కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే 45 అర్జీలను స్వీకరించారు. ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించి 45 అర్జీలను పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరగా పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని, సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపడమే ప్రజా దర్బార్ ముఖ్య ఉద్దేశమని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు,ప్రజలు పాల్గొన్నారు.

# జె.ఎల్.ఎమ్.సంజీవ్ నాయక్ సేవలు మరచిపోలేం



**పలమనేరు,పెన్ పవర్,ఆగస్టు 07:** జె.ఎల్.ఎమ్.సంజీవ్ నాయక్ సేవలు మరచిపోలేమని దండపల్లె గ్రామస్తులు కొనియాడారు.నియోజకవర్గ పరిధి, గంగవరం మండలం లోని దండపల్లె పంచాయతీ నందు గత ప్రభుత్వంలో జె.ఎమ్.సంజీవ్ నాయక్ విద్యుత్ శాఖ లో బాధ్యతలు స్వీకరించి ఇప్పటికి సుమారుగా 7సంవత్సరాలు పూర్తి అయి ఇప్పుడు బదిలీపై రాయచోటికి వెళుతున్నారు. ఈసందర్భంగా ఆయన సేవలను గుర్తించిన గ్రామస్తులు దండపల్లె పంచాయతీ సచివాలయంలో ఆయనను గ్రామస్తులు అత్యంత ఘనంగా సన్మానించారు.ఈసందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. తన సర్వీసులో ప్రతి ఒక్కరికీ సన్నిహితంగా ఉంటూ,రైతులకు అందుబాటులో ఉంటూ,ఏ అవసరం వచ్చినా నేనున్నానంటూ ముందుకు వచ్చి తన బాధ్యత నిర్వహించారని, ఎటువంటి అవినీతికి పాల్పడలేదని ఆయనను కొనియాడారు.ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు సుధా,సచివాలయ ఉద్యోగులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# నాయుడుపేటలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం



**నాయుడుపేట, పెన్ పవర్, ఆగష్టు 7 :** నాయుడుపేట పట్టణంలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ పట్టణ ఏ ఈ ఎన్. శివశంకర్ ఒక ప్రకటనలో తెలియజేశారు.నాయుడుపేట టౌన్ 33/11కేవీ సబ్ స్టేషన్ మరియు తుమ్మూరు 33/11కేవీ సబ్ స్టేషన్,జువ్వల పాలెం 33/11కేవీ సబ్ స్టేషన్ల లోని అన్ని సబ్ స్టేషన్లు మరమ్మత్తుల నిమిత్తం ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు విద్యుత్తు అంతరాయం ఉంటుందని తెలియజేశారు.నాయుడుపేట పట్టణం సబ్ స్టేషన్,తుమ్మూరు సబ్ స్టేషన్,జువ్వలపాలెం సబ్ స్టేషన్ ల పరిధిలో నాయుడుపేట పట్టణ పరిసరాల ప్రాంతాలల్లోని ప్రజలు,వినియోగదారులు తమ శాఖ సిబ్బందికి సహకరించగలరని కోరారు.

# కుల, ఆదాయ ధ్రువపత్రాల కోసం విద్యార్థుల అవస్థలు

## వారం రోజులుగా సర్వర్ సమస్య.. సచివాలయాలు, మీసేవ కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు

**గూడూరు, పెన్ పవర్,ఆగస్టు 7:** కులం, ఆదాయ ధ్రువపత్రాలు జారీ కాకపోవడంతో గూడూరు మండలంలోని విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత వారం రోజులుగా సర్వర్ సమస్య కారణంగా సర్టిఫికెట్ల జారీ ప్రక్రియ నిలిచిపోవడంతో మీసేవ కేంద్రాలు, సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు. మెడికల్ (నీట్), ఎంసెట్, డిగ్రీ తదితర కోర్సుల ఆన్‌లైన్ దరఖాస్తులు, వెబ్ ఆప్షన్లతో పాటు కాలేజీ అడ్మిషన్లు, స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు కుల, ఆదాయ ధ్రువపత్రాలు అవసరం కావడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. సర్టిఫికెట్లు లేకపోవడంతో తమ విద్యా అవకాశాలు దెబ్బతినే ప్రమాదం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మీసేవ కేంద్రాల్లో టోకెన్లు తీసుకుని గంటల తరబడి వేచి ఉన్నా 'సర్వర్ పనిచేయడం లేదు' అంటూ సమాధానం ఇస్తున్నారని, సచివాలయ సిబ్బంది కూడా సాంకేతిక సమస్యను కారణంగా చెబుతున్నారని విద్యార్థులు తెలిపారు. ఈ సమస్య ప్రభావం ముఖ్యంగా పేద, మధ్యతరగతి విద్యార్థులపై ఎక్కువగా ఉందన్నారు. గూడూరు తహసీల్దార్ కార్యాలయం, జిల్లా అధికారులు వెంటనే స్పందించి సర్వర్ సమస్యను పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన క్లియర్ చేసి విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించాలని వారు కోరుతున్నారు.

# మాదకద్రవ్యాలకు దూరం... సురక్షిత భవిష్యత్తుకు చేరువ

### విద్యార్థుల్లో మాదకద్రవ్యాల నిర్మూలన, రోడ్డు భద్రత, సైబర్ నేరాల నివారణ, మహిళల భద్రత, ర్యాగింగ్ నిరోధం, మానవ అక్రమ రవాణాపై అవగాహన సదస్సు




**నరసరావుపేట, పెన్ పవర్ ఆగస్టు 07:** పల్నాడు జిల్లా అదనపు ఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి, ఐపీఎస్ ఆదేశాల మేరకు శుక్రవారం నరసరావుపేట రామిరెడ్డిపేటలోని సరస్వతి సదన్ విట్ జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాల నిర్మూలన, రోడ్డు భద్రత, సైబర్ నేరాల నివారణ, మహిళల భద్రత, ర్యాగింగ్ నిరోధం, మానవ అక్రమ రవాణాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా పోలీస్ స్టేషన్ సీఐ తాళ్లూరి అశోక్ బాబు మాట్లాడుతూ విద్యాసంస్థల్లో ప్రశాంతమైన, సురక్షితమైన వాతావరణాన్ని నెలకొల్పేందుకు పోలీసు శాఖ కట్టుబడి ఉందని తెలిపారు. యువతను అసాంఘిక కార్యకలాపాల నుంచి దూరంగా ఉంచేందుకు విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమిష్టిగా బాధ్యత వహించాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు కుటుంబాలు, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు. ముఖ్యంగా 15 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు గల యువత గంజాయి, డ్రగ్స్ వంటి వ్యసనాలకు బానిసై నేరప్రవృత్తి వైపు మళ్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షణ వహించాలని ఆయన సూచించారు. పరిసర ప్రాంతాల్లో ఎవరైనా గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాలను వినియోగిస్తున్నా, విక్రయిస్తున్నా వెంటనే సమీప పోలీస్ స్టేషన్ లేదా 1972 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. రోడ్డు భద్రతపై మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాలు, ట్రాఫిక్ సంకేతాల ప్రాముఖ్యత, హెల్మెట్, సీటుబెల్ట్ తప్పనిసరి వినియోగం, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల జరిగే ప్రమాదాలు, పాదచారుల భద్రత, జీబ్రా క్రాసింగ్ వినియోగంపై అవగాహన కల్పించారు. మైనర్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు ఇవ్వవద్దని తల్లిదండ్రులకు సూచించారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తూ డిజిటల్ అరెస్ట్, ఉద్యోగ మోసాలు, కేవైసీ మోసాలు, పెట్టుబడి మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు తెలియని వ్యక్తులతో పంచుకోవద్దని, అనుమానాస్పద లింకులపై క్లిక్ చేయవద్దని సూచించారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి లేదా సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయడంతో పాటు సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని తెలిపారు. మహిళలు, బాలికల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన శక్తి యాప్ వినియోగంపై అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో శక్తి ఎస్‌ఓఎస్ సదుపాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ర్యాగింగ్ చట్టవిరుద్ధమైన చర్య అని, కొత్తగా చేరిన విద్యార్థులను మానసికంగా లేదా శారీరకంగా వేధించడం, బెదిరించడం, అవమానించడం వంటి చర్యలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యాసంస్థల యాజమాన్యాలు ర్యాగింగ్ నిరోధక కమిటీలను సమర్థవంతంగా నిర్వహిస్తూ విద్యార్థులకు సురక్షితమైన వాతావరణం కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ సీఐ తాళ్లూరి అశోక్ బాబు, విట్ జూనియర్ కళాశాల డైరెక్టర్ డి. శ్రీనివాసరావు, ప్రిన్సిపాళ్లు ఎల్. శివాజీ, మోహన్, అధ్యాపకులు, సిబ్బంది, సుమారు 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# క్రీడలతో విద్యార్థుల్లో ప్రతిభ, క్రమశిక్షణ పెంపొందుతుంది

### అమరావతి ఛాంపియన్‌షిప్ - 2026ను ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాద అరవిందబాబు





**నరసరావుపేట, పెన్ పవర్ ఆగస్టు 07:** విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాద అరవిందబాబు అన్నారు. క్రీడల ద్వారా శారీరక దృఢత్వంతోపాటు క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని పేర్కొన్నారు. స్థానిక సత్తెనపల్లి రోడ్డులోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన అమరావతి ఛాంపియన్‌షిప్--2026 జిల్లా స్థాయి క్రీడా పోటీలను ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని యువ క్రీడా ప్రతిభను వెలికితీసి వారికి మెరుగైన అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం, స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో అమరావతి ఛాంపియన్‌షిప్--2026 నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో మూడు లక్షలకు పైగా యువ క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారని చెప్పారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. జూలై 15 నుంచి ఆగస్టు 26 వరకు మూడు దశల్లో---నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పోటీలు జరుగుతున్నాయని తెలిపారు. ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. మొత్తం సుమారు రూ.94 లక్షల నగదు బహుమతులను అందించనున్నట్లు తెలిపారు. ఆర్చరీ, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాక్సింగ్, బాస్కెట్‌బాల్, చెస్, హాకీ, కబడ్డీ, ఖోఖో, వెయిట్‌లిఫ్టింగ్, వాలీబాల్, యోగా తదితర 12 క్రీడా విభాగాల్లో అండర్--17, అండర్--23 బాలురు, బాలికలకు పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. పల్నాడు జిల్లా నుంచి సుమారు 900 మంది క్రీడాకారులు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటున్నారని పల్నాడు జిల్లా క్రీడా శాఖ అధికారి నరసింహారెడ్డి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 70 మంది పిఈటి లు పాల్గొన్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడా ప్రతిభను గుర్తించి వారికి తగిన శిక్షణ, అవకాశాలు కల్పించడం ద్వారా భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు ఈ పోటీలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాశాఖ అధికారి నర్సింహారెడ్డి, క్రీడా కోచ్‌లు, క్రీడాకారులు, ఉమ్మడి కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సమాచార వ్యాప్తిని బలోపేతం చేసేందుకు ఐఎంపిసిసి సమావేశాన్ని నిర్వహించిన పిఐబి విజయవాడ



**విజయవాడ, పెన్ పవర్, ఆగస్ట్ 07:** ప్రజా సమాచార వ్యాప్తిని వేగవంతం చేసి, అవాస్తవ సమాచారాన్ని అడ్డుకునేందుకు ప్రభుత్వ శాఖల మధ్య బలమైన సమన్వయానికి పిలుపు. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం పరిధిలోని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పిఐబి) విజయవాడ, వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖల ప్రచార విభాగాల మధ్య పరస్పర సమన్వయాన్ని బలోపేతం చేసేందుకు, ప్రతిష్టాత్మక కార్యక్రమాల ప్రచార వ్యూహాలను మెరుగుపరిచేందకు, అవాస్తవ సమాచారాన్ని అడ్డుకునేందుకు మరియు ప్రభుత్వ సమాచార ప్రసారాన్ని బలోపేతం చేసేందుకు ఇంటర్ మీడియా పబ్లిసిటీ కోఆర్డినేషన్ కమిటీ (ఐఎంపిసిసి) సమావేశాన్ని ఈ రోజు నిర్వహించింది. జి. సురేష్ కుమార్, డైరెక్టర్, పిఐబి విజయవాడ ప్రారంభోపన్యాసంలో... కేంద్ర సమాచార మరియు ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన మీడియా విభాగాలైన విజయవాడ ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, దూరదర్శన్ మరియు ఆల్ ఇండియా రేడియోలు చేపట్టిన పలు ప్రధాన కార్యక్రమాలను ప్రముఖంగా ప్రస్తావించారు. సమర్థవంతమైన ప్రజా సమాచార ప్రసారం కోసం అన్ని విభాగాల మధ్య సమన్వయ ప్రయత్నాల ప్రాముఖ్యతను ఆయన వివరించారు. అలాగే ప్రభుత్వ కార్యక్రమాలు, చొరవలకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు చేరవేయడంలో ఈ మీడియా విభాగాల నుంచి పూర్తి మద్దతు ఉంటుందని కూడా ఆయన హామీ ఇచ్చారు. వివిధ కేంద్ర ప్రభుత్వ విభాగాలు మరియు సంస్థల ప్రతినిధులు వారి కీలక కార్యకలాపాలు, కార్యక్రమాలు మరియు విజయాలను పంచుకునేందుకు ఈ ఐఎంపిసిసి సమావేశం ఒక వేదికైంది. ఈ సమావేశంలో తపాలా, రైల్వేలు, ఎయిమ్స్, ఎన్‌హెచ్‌ఏఐ, ఎఫ్‌సిఐ, కెవిఐసి, ఎన్‌ఎస్‌ఓ, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్, దూరదర్శన్ మరియు ఆకాశవాణి వంటి పలు కేంద్ర ప్రభుత్వ విభాగాలు మరియు సంస్థల నుంచి 15 మందికి పైగా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు సమాచార వ్యూహాలను మెరుగుపరించేందుకు వారి అభిప్రాయాలను మరియు సూచనలను పంచుకున్నారు. ఇటీవల వారి విభాగాల్లో చేపట్టిన ప్రచార కార్యక్రమాలపై తాజా సమాచారాన్ని కూడా అందించారు.

# ప్రపంచ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఘనంగా వేడుకలు

### చేనేత కార్మికులకు ప్రత్యేక భవనం నిర్మించాలని వినతులు



**నరసరావుపేట, పెన్ పవర్ ఆగస్టు 07:** ప్రపంచ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నరసరావుపేటలో చేనేత కార్మికులు ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించిన చేనేత కార్మికులు పల్నాడు జిల్లా కలెక్టరేట్‌కు చేరుకుని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లాకు వినతిపత్రం అందజేశారు. పల్నాడు జిల్లాలో చేనేత కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక చేనేత భవనం నిర్మించాలని కోరగా, కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకునేందుకు తప్పకుండా ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం నరసరావుపేటలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో చేనేత కుటుంబ సభ్యులు నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబును నేత వస్త్రాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రత్యేక చేనేత భవనం నిర్మించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. వినతిపై స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్‌తో చర్చించి చేనేత భవనం నిర్మాణానికి అవసరమైన చర్యలు త్వరలోనే ప్రారంభించేలా కృషి చేస్తామని తెలిపారు. చేనేత కార్మికుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జంజనం వెంకటేశ్వర్లు, గుంటి వెంకటేశ్వర్లు, గంజి జోగేశ్వరరావు, జొన్నాదుల హనుమాన్ ప్రసాద్, అవ్వరు రవికాంత్, చిన్న వెంకటేశ్వర్లు, ఊట్ల శ్రీనివాసరావు, ఉద్దెంటి సుబ్బారావు, పి.వి. శ్రీనివాసరావు, జి. వెంకట్రావు, గుర్రం శ్రీనివాసరావు, అశ్విని స్కాన్ సెంటర్ రాంప్రసాద్, రాఖీ న్యూస్ రిపోర్టర్లు మాడెం మల్లికార్జునరావు, సాకిబాలు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్ ను మర్యాద పూర్వకంగా కలిసిన డిజిటల్ క్రియేటర్స్



**గుంటూరు, పెన్ పవర్,ఆగస్టు 7 :** గుంటూరు డిజిటల్ క్రియేటర్స్ అసోసియేషన్ (డి.జి.సి.ఎ) సభ్యులు జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ ను జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సానుకూల దృక్పథం కలిగి ఉండాలని అన్నారు. ప్రజల్లో మంచిని పెంపొందించే విధంగా, మంచి ఆలోచన ధోరణి కలిగించే విధంగా కృషి చేయాలని సూచించారు. గ్రీన్ గుంటూరు, నవ గుంటూరు కార్యక్రమాలను జిల్లాలో ప్రార్భించామని, వాటిని ప్రజల్లోకి తీసుకువెళ్ళుటకు సహకరించాలని కోరారు. గ్రీన్ గుంటూరులో భాగంగా జిల్లా ప్రజలు పచ్చదనం పెంపొందించే కార్యక్రమంలో స్వచ్ఛందంగా భాగస్వామ్యం అయ్యే విధంగా చేయాలని అన్నారు. ఆరు అడుగుల మొక్కలను నాటి, సెల్ఫీ ఫోటో తీసి గ్రీన్ గుంటూరు హాష్ ట్యాగ్ కు అనుసంధానించ వచ్చని చెప్పారు. ఎక్కువ మొక్కలు నాటిన వారికి ఆగస్టు 15వ తేదీన,హాహాస్వాతంత్ర్య దినోత్సవం రోజున బహుమతితో పాటు ప్రశంసా పత్రాన్ని అందించడం జరుగుతుందన్నారు. ఈ పోటీలో పాల్గొని బహుమతులు అందుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లాలో కేవలం 7.2 శాతం మాత్రమే పచ్చదనం ఉందన్నారు. పరిస్థితిలో మార్పు తీసుకువచ్చి గుంటూరును హరితమయంగా మార్చేందుకు ఇది ఉపయోగపడుతుందన్నారు. “గ్రీన్ గుంటూరు” ప్రణాళికలో భాగంగా గుంటూరు పార్లమెంట్ పరిధిలో 1.20 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందని చెప్పారు. మొక్కలు నాటడమే కాకుండా, వాటి సంరక్షణకు అత్యంత ప్రాధాన్యతను ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. మొక్కలకు జియో-ట్యాగింగ్ చేసి మొబైల్ యాప్ ద్వారా నిరంతరం పర్యవేక్షించేలా కచ్చితమైన సాంకేతిక వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు చేపట్టామని చెప్పారు. వెల్త్ ఫ్రమ్ వేస్ట్ (చెత్త నుండి సంపద) విధానంలో భాగంగా నగరంలో చెత్త నుంచి తయారుచేసిన కంపోస్ట్ ఎరువును ప్రస్తుతం నాటుతున్న మొక్కలకు ఉపయోగించుటకు చర్యలు చేపట్టామని చెప్పారు. పచ్చదనంతో పాటు నగరంలో స్వచ్ఛతను పెంపొందించేందుకు ‘నవ గుంటూరు’ కార్యక్రమంలో భాగంగా గుంటూరును దేశంలోనే అత్యుత్తమ నగరాలలో ఒకటిగా తీర్చిదిద్దడమే ప్రధాన ధ్యేయంగా రూపకల్పన చేశామన్నారు. మిషన్ జీరో ప్లాస్టిక్” కార్యక్రమాన్ని, ఆగస్ట్ 15వ తేదీ నుంచి అమలుకు చర్యలు చేపట్టారు. నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ (ఒకసారి వినియోగించే ప్లాస్టిక్ సంచులు) వాడినా లేదా రోడ్లపై చెత్త వేసినా జరిమానాలు విధించే విధానాన్ని ప్రారంభించడం జరుగుతుందన్నారు.


# ఆలయాల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు : ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు, పెన్ పవర్, ఆగస్ట్, 07:** గుంటూరు నగరంలోని వాసవి వాసవి కన్యకాపరమేశ్వరి మండపంలో శుక్రవారం అమ్మవారు శాకంబరీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే నసీర్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అన్ని ఆలయాల అభివృద్ధికి పక్కా ప్రణాళికాబద్ధంగా పనులు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే వెంకటేశ్వర స్వామి, ప్రసన్నాంజనేయ స్వామి ఆలయాల పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేశామన్నారు. అన్ని ఆలయాలకు కమిటీల నియమించామని, భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఆలయాల్లో పూజలు, వైదిక కైంకర్యాల నిర్వహణలో రాజకీయ, అధికారుల జోక్యాన్ని తగ్గించి, అర్చకులకు స్వయం ప్రతిపత్తి కల్పిస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆరు వేలకుపైగా ఆలయాల పునర్నిర్మాణం, మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేశారన్నారు. శ్రీవాణి ట్రస్ట్ నిధులతో గ్రామీణ ప్రాంతాలు, వెనుకబడిన వర్గాల కాలనీలు మరియు టిడ్కో నివాస ప్రాంతాలలో వేలాది భజన మందిరాల నిర్మాణాన్ని చేపడుతున్నారని తెలిపారు. పేదలకు ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. శుక్రవారం స్థానిక పాత గుంటూరులోని శ్రీకృష్ణ కళ్యాణ మండపంలో టీడీపీ నేతలు యల్లావుల అశోక్, తిరుమలశెట్టి మోహన్ రావు సహకారంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే నసీర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్య శిబిరంలో వైద్యులు వాణి, పీయూష, సాయి ప్రవల్లిక, సుదీష్ణ నిరీష పేదలకు వైద్య సేవలందించారు. పరీక్షల అనంతరం ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి వైద్య సలహాలు అందించారు.

# సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే ఏలూరి ఘన స్వాగతం


### సభా ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు, అధికారులు



**చీరాల, పెన్ పవర్, ఆగస్టు 7:** జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ‘నేతన్న సేవలో’ కార్యక్రమంలో పాల్గొనేందుకు చీరాలకు వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఘన స్వాగతం పలికారు. మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే ఏలూరి పుష్పగుచ్ఛం అందించి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఎమ్మెల్యే ఏలూరిని ఆప్యాయంగా పలకరించారు. అనంతరం పర్చూరు నియోజకవర్గంలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి ఎమ్మెల్యే ఏలూరి ముఖ్యమంత్రికి వివరించారు. నియోజకవర్గంలో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులు, ప్రజా సంక్షేమ కార్యక్రమాల పురోగతిని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఇదిలా ఉండగా, ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఏర్పాట్లను మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, సవిత, ఎంపీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్యేలు ఎం.ఎం. కొండయ్య, నరేంద్రవర్మ, నక్కా ఆనందబాబు తదితరులు పరిశీలించారు. తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు సలగల రాజశేఖరబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి నక్కల రాఘవ, జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్‌కుమార్, ఎస్పీ బి. ఉమామహేశ్వర్ తదితర అధికారులు సభా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతంగా జరిగేలా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, పార్టీ నాయకులు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేశారు.

# బాపట్ల జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారికి సీఎం అభినందనలు

### రాష్ట్ర సంతృప్తి స్థాయిని మించి జిల్లా పనితీరు నమోదు




**చీరాల, పెన్ పవర్, ఆగస్టు 7:** బాపట్ల జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం కేవలం రెండు నెలల వ్యవధిలోనే శాఖ పనితీరులో గణనీయమైన మార్పులు తీసుకువచ్చిన జిల్లా సివిల్ సప్లై అధికారి ఎ. జగన్మోహన్ రావుకు ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో ప్రజలకు పౌరసరఫరాల సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు పలు సంస్కరణలు చేపట్టి, సేవల నాణ్యతను మెరుగుపరిచిన ఫలితంగా రాష్ట్రవ్యాప్తంగా నమోదైన సంతృప్తి స్థాయికంటే బాపట్ల జిల్లా సంతృప్తి స్థాయి రెండు శాతం అధికంగా నమోదైనట్లు వెల్లడైంది. జిల్లా పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా జిల్లా సివిల్ సప్లై అధికారి ఎ. జగన్మోహన్ రావును అభినందించినట్లు సమాచారం. ఈ సందర్భంగా జిల్లా అధికారులు, సిబ్బంది, పలువురు ప్రజాప్రతినిధులు ఎ. జగన్మోహన్ రావుకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు.

# ప్రతిరోజూ కనీసం 70 కేసుల విచారణ పూర్తి చేయాలి

**ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ ఎం.వి. శేషగిరి బాబు**




**విజయవాడ, పెన్ పవర్,ఆగస్టు 7:** ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా అందిన ప్రతి క్లెయిమ్, అభ్యంతరాన్ని నిబంధనల ప్రకారం పారదర్శకంగా విచారించి, నోటీసు జారీ చేసిన ఏడు రోజుల్లోగా పరిష్కరించాలని ఎన్టీఆర్ జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ ఎం.వి. శేషగిరి బాబు అధికారులను ఆదేశించారు. విజయవాడ కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పెండింగ్ దరఖాస్తులను వేగంగా పరిష్కరించేందుకు ప్రతిరోజూ కనీసం 70 క్లెయిమ్స్, అభ్యంతరాలపై విచారణ నిర్వహించాలని సూచించారు. క్షేత్రస్థాయి విచారణలో సంబంధిత వ్యక్తుల స్టేట్మెంట్లను పక్కాగా నమోదు చేయాలని, క్లెయిమ్స్, అభ్యంతరాలకు సంబంధించిన సమాచారాన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందుబాటులో ఉంచాలని తెలిపారు. అర్హులైన ఓటర్ల హక్కులు పరిరక్షించడంతో పాటు అనర్హుల పేర్లను నిబంధనల ప్రకారం తొలగించేలా ప్రక్రియ సాగాలని సూచించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ మాట్లాడుతూ, బీఎల్ఓలు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని, ఫోటోలలోని లోపాలను సరిచేయడంతో పాటు ఒకే కుటుంబ సభ్యుల ఓట్లు సాధ్యమైనంత వరకు ఒకే పోలింగ్ బూత్ పరిధిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన పలు సూచనలు చేయగా, అనంతరం ఫోటోలతో కూడిన ఓటర్ల జాబితాలను పార్టీల ప్రతినిధులకు ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ అందజేశారు.

# రహదారి భద్రతా నియమాలపై అవగాహన కల్పించిన ఈస్ట్ ట్రాఫిక్ పోలీసులు




**గుంటూరు,పెన్ పవర్,ఆగస్టు 7:** గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలు, ట్రాఫిక్ డీఎస్పీ బి. బెల్లం శ్రీనివాసరావు సూచనల మేరకు గుంటూరు ఈస్ట్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో మహిళా కళాశాలలో శుక్రవారం ట్రాఫిక్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 250 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈస్ట్ ట్రాఫిక్ సీఐ ఎ. అశోక్ కుమార్ ప్రొజెక్టర్ ద్వారా రహదారి భద్రత, ట్రాఫిక్ నియమాలు, ట్రాఫిక్ ఉల్లంఘనల వల్ల జరిగే ప్రమాదాలు, చట్టపరమైన పరిణామాలపై విద్యార్థినులకు సులభంగా అర్థమయ్యే విధంగా వివరించారు. ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు వాహనం నడిపే వ్యక్తితో పాటు వెనుక కూర్చున్న వారు కూడా ఐఎస్ఐ మార్కు కలిగిన హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ, ఇన్సూరెన్స్ వంటి వాహన పత్రాలను ఎల్లప్పుడూ వెంట ఉంచుకోవాలని తెలిపారు. ట్రిపుల్ రైడింగ్ పూర్తిగా నిషేధమని, డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగం ప్రమాదాలకు ప్రధాన కారణమవుతుందని హెచ్చరించారు. పాదచారులు జీబ్రా క్రాసింగ్‌లను వినియోగిస్తూ రహదారులు దాటాలని, ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. మహిళలు స్వయంగా డ్రైవింగ్ నేర్చుకొని బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని, తమ భద్రతను తామే కాపాడుకోవాలని సీఐ అశోక్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని ఈస్ట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆర్ఎస్ఐ మదన్‌తో పాటు ఇతర పోలీసు సిబ్బంది పర్యవేక్షించారు.

# ఎల్-నినోను ఎదుర్కొనేందుకు 'రైతన్న మీ కోసం' కార్యాచరణ ప్రారంభం



**గుంటూరు, పెన్ పవర్, ఆగస్ట్, 07 :** రాబోయే ఎల్-నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'రైతన్న మీ కోసం -- ఎల్-నినో ప్రభావ నివారణ కార్యాచరణ ప్రణాళిక' కార్యక్రమాన్ని గుంటూరు జిల్లా మెడికొండూరు మండలం సిరిపురం గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్ కుమార్, జాయింట్ డైరెక్టర్ పద్మావతి, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ రాజకుమారి తదితరులు పాల్గొన్నారు. ఎల్-నినో ప్రభావంతో వర్షాభావం, అధిక ఉష్ణోగ్రతలు, నీటి కొరత వంటి పరిస్థితులు ఎదురయ్యే అవకాశమున్నందున రైతులు మిశ్రమ పంటలు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, కూరగాయలు, పశుగ్రాస పంటలను సాగు చేయాలని అధికారులు సూచించారు. అలాగే ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, విత్తన గుళికల వినియోగం, ద్రవ జీవామృతం, నిమాస్త్రం వంటి సహజ ఇన్‌పుట్‌ల వినియోగంపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా ఉత్పత్తి వ్యయం తగ్గడంతో పాటు నేల సారవంతం పెరిగి, రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందని అధికారులు తెలిపారు. ప్రతి రైతు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని, ఎల్-నినో సవాళ్లను సమర్థంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు.

# రైతు గోడు వినాలి.. కాలువలకు నీరు వదలాలి

**సాగునీరు విడుదల చేయాలని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఉప్పాల రాము డిమాండ్**





**పెడన, పెన్ పవర్, ఆగస్టు 7:** రైతులకు తక్షణమే సాగునీరు విడుదల చేసి పంటలను కాపాడాలని డిమాండ్ చేస్తూ పెడన నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఉప్పాల రాము ఆధ్వర్యంలో శుక్రవారం రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి సమస్యను నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. కాలువలకు సకాలంలో నీరు విడుదల చేయకపోవడంతో వేలాది ఎకరాల్లో సాగు చేసిన పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు.రైతుల కష్టాలను దృష్టిలో ఉంచుకుని వెంటనే ప్రధాన కాలువలు, ఉప కాలువల ద్వారా సాగునీటిని విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల ప్రయోజనాల కోసం అవసరమైతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం స్పందించకపోతే మండల, జిల్లా స్థాయిలో ఆందోళన కార్యక్రమాలను విస్తరిస్తామని తెలిపారు.రైతులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఉప్పాల రాము స్పష్టం చేశారు. ఈ రిలే నిరాహార దీక్షలకు నియోజకవర్గ వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, రైతులు పెద్ద ఎత్తున హాజరై సంఘీభావం ప్రకటించారు.ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మైలా రత్నకుమారి, పెడన ఎంపీపీ రాజులపాటి వాణి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ గరికపాటి చారుమతి, కృష్ణాజిల్లా వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి గరికపాటి రామానాయుడు, పెడన మండల నాయకులు కొండవేటి నాగబాబు, సింగంశెట్టి రాంబాబు, రాజులపాటి అచ్యుతరావు, పెడన పట్టణ నాయకులు కటకం ప్రసాద్, బళ్ల గంగయ్య, బండారు మల్లి, సిరివెళ్ల జయేష్, కోమట్ల అనిల్ కుమార్, రౌతుల ప్రసాద్, కోడూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పోలవరం లో ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం



**పెడన,పెన్ పవర్ ఆగస్టు 7 :** 12వ జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని గూడూరు మండలం పోలవరం గ్రామంలోని పోలవరం చేనేత సహకార సంఘ కార్యాలయంలో శుక్రవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని చేనేత వృత్తి విశిష్టతను చాటిచెప్పారు. తరతరాలుగా చేనేత వృత్తినే నమ్ముకుని జీవనం సాగిస్తున్న అనుభవజ్ఞులైన చేనేత కార్మికులను ఈ సందర్భంగా శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. చేనేత పరిశ్రమ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తోందని, సంప్రదాయ వృత్తులను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వక్తలు పేర్కొన్నారు. యువత కూడా చేనేత రంగంపై ఆసక్తి పెంచుకుని ఈ వృత్తి అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు.కార్యక్రమంలో హ్యాండ్లూమ్ ఏడీ సీహెచ్ విజయబాబు, డెవలప్‌మెంట్ అధికారులు చింతయ్య, రాజశేఖర్, రాజు, లోకేష్, విజయవాడ చేనేత సేవా కేంద్రం అధికారి కరుణాచారి పాల్గొని చేనేత కార్మికులను అభినందించారు. అలాగే గూడూరు మండల టీడీపీ అధ్యక్షుడు గోపీనాగబాబు, మండల ప్రధాన కార్యదర్శి తోటా వేణు, పెడన పట్టణ టీడీపీ అధ్యక్షుడు యక్కల శ్యామలయ్య, అంతర్జాతీయ మానవ హక్కుల యూత్ ప్రెసిడెంట్ పడవల త్రినాథ్, మండల టీడీపీ నాయకులు కట్రెడ్డి నాగమురళి, బీజేపీ మండల అధ్యక్షుడు కోలపల్లి రజిని, రామన్నపేట పిఎసిఎస్ చైర్మన్ మురాల దనేష్,రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి ఎన్‌ఏ బేగ్ మునగాల భాస్కరరావు, పోతుల రాము, కారుపర్తి మల్లి తదితరులు పాల్గొన్నారు. చేనేత కార్మికులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు కార్యక్రమానికి హాజరై విజయవంతం చేశారు.

# నరసరావుపేటలో కేంద్ర ప్రభుత్వ ఆధార్ సేవా కేంద్రం ప్రారంభం

**ప్రారంభించి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు**



**నరసరావుపేట, పెన్ పవర్ ఆగస్టు 07:** రిపల్నాడు జిల్లా నరసరావుపేటలోని సతీష్ రోడ్డులో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆధార్ సేవా కేంద్రాన్ని శుక్రవారం నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ప్రారంభించారు. ఆధార్ రీజనల్ ఆఫీస్ హైదరాబాద్ పర్యవేక్షణలో ఈ కేంద్రం ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ, విశాఖపట్నం, కాకినాడ తదితర ప్రాంతాల్లో ఉన్న ప్రత్యేక ఆధార్ సేవా కేంద్రాల తరహాలో నరసరావుపేటలోనూ ఈ కేంద్రం అందుబాటులోకి రావడంతో స్థానిక ప్రజలకు ఆధార్ సేవలు మరింత సులభతరం కానున్నాయి. ఆధార్ సేవా కేంద్రం లో కొత్త ఆధార్ నమోదు, పేరు, చిరునామా, లింగం, పుట్టిన తేదీ, మొబైల్ నంబర్, ఈ--మెయిల్ వంటి వివరాల నవీకరణతో పాటు ఫోటో, వేలిముద్రలు, ఐరిస్ వంటి బయోమెట్రిక్ వివరాల అప్‌డేట్ సేవలు అందుబాటులో ఉంటాయి. ఆధార్ డౌన్‌లోడ్, ప్రింట్ తదితర సేవలను కూడా ప్రజలు పొందవచ్చు. ప్రత్యేకంగా రూపొందించిన ఈ కేంద్రంలో ఎయిర్ కండిషన్డ్ వాతావరణం, వీల్‌చైర్‌కు అనుకూలమైన సదుపాయాలు, వృద్ధులు, దివ్యాంగులకు అవసరమైన ప్రత్యేక ఏర్పాట్లు ఉంటాయి. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు వారంలో ఏడు రోజులూ సేవలు అందుబాటులో ఉంటాయని సిబ్బంది తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ నరసరావుపేట ప్రజలకు సమీపంలోనే కేంద్ర ప్రభుత్వ ఆధార్ సేవా కేంద్రం అందుబాటులోకి రావడం సంతోషకరమన్నారు. ఆధార్‌కు సంబంధించిన సేవల కోసం ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే సేవలు పొందే అవకాశం ఏర్పడిందన్నారు. ప్రజలు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు అంకమ్మ చౌదరి, మిస్టర్ గ్రాండ్ సుబ్బు, సిబ్బంది పాల్గొన్నారు.

# బీ2 ఎక్స్పో - 160 స్టాల్స్‌తో వ్యాపార, సేవా రంగాల సమ్మేళనం





**గుంటూరు,పెన్‌పవర్,ఆగస్టు 7:** గుంటూరు - అమరావతి రోడ్డులోని బండ్లమూడి గార్డెన్స్ లో నిర్వహిస్తున్న బీ2 ఎక్స్పో--2026 ఈరోజు అత్యంత వైభవంగా ప్రారంభమైంది. వివిధ వ్యాపార, వైద్య, విద్య, పారిశ్రామిక, సేవా రంగాలకు చెందిన లిలి160కు పైగా స్టాల్స్ ఈ ఎక్స్పోలో ఏర్పాటు చేయగా, సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.ఈకార్యక్రమాన్ని గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మహమ్మద్ నజీర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం రోటరీ జిల్లా గవర్నర్ వడ్లమాని రవి ఎక్స్పోలో ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను ప్రారంభించి సందర్శించారు. ఈకార్యక్రమంలో ధృతి హాస్పిటల్ డాక్టర్ హరికృష్ణ ప్రముఖ పారిశ్రామికవేత్త బి.వి. సుబ్బారావు ఐడి హాస్పిటల్ సూపరింటెండెంట్ డా. ఎస్. రఘు ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్ మరియు హెచ్‌సి అండ్ హెచ్ఎస్ కౌన్సిల్ అధ్యక్షులు గబ్బిట శివరాం ప్రసాద్, డాక్టర్ రమణ యశస్వి, రంగావజ్జుల లక్ష్మీపతి, రామచంద్ర రాజు, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహమ్మద్ నజీర్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం అనంతరం దేశంలోని అనేక చిన్న పట్టణాలు అభివృద్ధి చెంది నేడు స్మార్ట్ సిటీలుగా ఎదిగాయని అన్నారు. అయితే ఒకప్పుడు ప్రముఖ నగరంగా వెలుగొందిన గుంటూరు ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందలేదని పేర్కొన్నారు. గుంటూరులోని వ్యాపార, పారిశ్రామిక, సేవా రంగాల సామర్థ్యాన్ని సమాజానికి పెద్ద ఎత్తున పరిచయం చేయడానికి బీ2 ఎక్స్పో వంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగ పడతాయని అభిప్రాయపడ్డారు. ఈ ఎక్స్పోను విజయవంతంగా నిర్వహించిన బీ2 ఎక్స్పో అధ్యక్షులు కుమ్మమూరు శ్రీధర్ బాబు, భీమవరపు హేమంత్ తో పాటు నిర్వహణలో కృషి చేసిన ప్రతి ఒక్కరినీ ఆయన అభినందించారు. అలాగే ధృతి హాస్పిటల్స్‌కు చెందిన డా. హరికృష్ణ మాట్లాడుతూ యువతను ఒక వేదికపైకి తీసుకువచ్చి, వారి సహకారంతో ఇంత పెద్ద కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్తులో మరిన్ని నిర్వహించి గుంటూరు అభివృద్ధికి దోహదపడాలని ఆకాంక్షించారు. వ్యాపార, వైద్య, విద్య, సాంకేతిక, సేవా రంగాలకు చెందిన ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, యువ పారిశ్రామికవేత్తలు, విద్యార్థులు, ప్రజలు భారీ సంఖ్యలో హాజరై ఎక్స్పోను సందర్శించారు. ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభమైన ఈ బీ2 ఎక్స్పో సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈకార్యక్రమం విజయవంతం కావడంలో నిర్వహణ కమిటీ సభ్యులు విశేష కృషి చేశారు. శ్రీధర్ బాబు, హేమంత్ సారధ్యంలో ప్రారంభమైన బి 2 ఎక్స్పో కార్యక్రమంలో రవిశంకర్, ఎ.వి. రమణమూర్తి, వీరకుమార్, బద్రి, కోటేశ్వరరావు, అన్నంరాజు వంశీ వివిధ విభాగాల కమిటీ సభ్యులు సమన్వయంతో వ్యవహరిస్తూ ఎక్స్పోను అత్యంత విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమ నిర్వహణలో వారి సేవలను పలువురు ప్రముఖులు ప్రత్యేకంగా అభినందించారు.

# ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ ప్రజావేదికకు విశేష స్పందన



**నరసరావుపేట, పెన్ పవర్ ఆగస్టు 07 :** ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునే ఉద్దేశంతో నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు శుక్రవారం ప్రజా వేదిక నిర్వహించారు. స్థానిక గుంటూరు రోడ్డులోని ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు హాజరై తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మొత్తం 22 ఫిర్యాదులు ప్రజల నుంచి అందాయి. ఫిర్యాదుదారుల నుంచి ప్రతి సమస్యను ఎమ్మెల్యే స్వయంగా సావధానంగా విని, సంబంధిత వివరాలను తెలుసుకుని ఫిర్యాదులను స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో చర్చించారు. కొన్ని సమస్యలపై అక్కడికక్కడే సంబంధిత శాఖల అధికారులతో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడి ప్రజల ఇబ్బందులను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మిగిలిన ఫిర్యాదులను సంబంధిత శాఖలకు పంపించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చేలా ప్రజా వేదికను నిర్వహిస్తున్నట్లు, అందిన ఫిర్యాదుల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ చర్యలు తీసుకుంటున్నట్లు కార్యాలయ వర్గాలు తెలిపాయి.

# ప్రజల సంతృప్త స్థాయి పెరగాలి

**జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ**



**గుంటూరు, పెన్ పవర్ ఆగస్టు 7 :** ప్రభుత్వ పథకాలు పట్ల ప్రజల సంతృప్త స్థాయి పెరగాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ అన్నారు. పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్ పై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ శుక్రవారం గుంటూరు నగర పాలక సంస్థ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. సానుకూల స్పందన పొందేవిధంగా ఎప్పుడూ పనిచేయాలని సూచించారు. ప్రతి అంశాన్ని నిశితంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. శాఖా పరమైన సూచీలకు అనుగుణంగా ఖచ్చితమైన, నాణ్యమైన డేటాను నమోదు చేసి, లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# నరసరావుపేటలో రెండేళ్ల నమ్మకం -అభివృద్ధి, సంక్షేమంపై ఇంటింటా ప్రచారం

**పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు**



**నరసరావుపేట, పెన్ పవర్ ఆగస్టు 07 ::** ఉమ్మడి కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు నిర్వహిస్తున్న రెండేళ్ల నమ్మకం--అభివృద్ధి, సంక్షేమం డోర్ టు డోర్ కార్యక్రమం శుక్రవారం సాయంత్రం నరసరావుపేట పట్టణంలోని 27వ వార్డులో కొనసాగింది. శివుని బొమ్మ వద్ద ప్రారంభమైన కార్యక్రమం మహాలక్ష్మమ్మ చెట్టు వరకు కొనసాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లిన ఎమ్మెల్యే కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల వివరాలను స్థానికులకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్థానికులతో ఆప్యాయంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యేకు స్థానికులు పూల వర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు. కార్యక్రమానికి స్థానికుల నుంచి మంచి స్పందన లభించింది. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లపాటి రామచంద్ర ప్రసాద్, నరసరావుపేట మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ సుబ్బరాయ గుప్తా, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గట్టుపల్లి సత్యనారాయణ, నాయకులు అంకమ్మ చౌదరి తదితరులు పాల్గొన్నారు.